విద్యారుణ శిబిరాలు నిర్వహించాలి

- బ్యాంకులు లక్ష్యాలను చేరుకోవాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యారుణ శిబిరాలు నిర్వహించి నిరుపేద తల్లిదండ్రులకు తక్షణ మే సాయం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో శుక్రవారం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా బ్యాంకుల వారీగా రుణలక్ష్యాలు, సాధింపులపై కలెక్టర్ సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో విద్యారుణాలు రూ.1203.84 కోట్లు లక్ష్యంగా ఉండగా.. ఇప్పటి వరకు కేవలం రూ.131.95 కోట్లు (10.96 శాతం) మాత్రమే అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు తక్షణమే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు విద్యారుణాలు అందించి ఆదుకోవాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.55,908.22 కోట్లు కాగా.. రూ.37,185.65 కోట్లు సాధించడం జరిగిందని, బ్యాంకులు నెల వారీగా టార్గెట్ నిర్దేశించుకుని అర్హులకు రుణాలను అందించాలని సూచించారు. స్వానిధి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సకాలం లో రుణాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.గోమతి, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎం జీఎం సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్లు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అవార్డుకు అమృతవల్లి ఎంపిక


అమృతవల్లి

రవీంద్రభారతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా, పెద్దాపురం గ్రామానికి చెందిన ఏవీఎ్‌ఎడీ అమృతవల్లి అంతర్జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని మన సంస్కృతి సంస్థ సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ దివేది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభా పరీక్షల్లో అమృతవల్లి వరుసగా ఆరుసార్లు విజేతగా నిలిచిందన్నారు. సీబీఎస్‌సీ టెన్త్ తెలుగు సబ్జెక్టులో వందకు 99 మార్కులు సాధించిందన్నారు. మాతృభాషలో రాణిస్తున్న అమృతవల్లి ప్రతిభను మలేషియాకు చెందిన యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్ అండ్ కల్చరల్ సంస్థ గుర్తించినట్లు చెప్పారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతియేటా వివిధ దేశాలకు చెందిన ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ పురస్కారాలు అందజేస్తారని, ఈ ఏడాది అమృతవల్లిని ఎంపిక చేశారని తెలిపారు. ఈనెల 17న మలేషియాలో పురస్కార ప్రదానోత్సవంలో అమృతవల్లి అవార్డు అందుకోనున్నారు.

రామ్‌దేవ్‌రావు ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన యువకుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రిలో శుక్రవారం మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. వీకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమా రు 300 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 300 సార్లు రక్తదానం చేసిన సంపత్‌ను, 249 సార్లు రక్తదానం చేసిన శ్రీనివాస్ గోగరాజు, 99 సార్లు రక్తదానం చేసిన మహేందర్‌రెడ్డితో పాటు మరో పదిమంది రక్తదాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు కమలాకర్, యోబు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ధ్రువపత్రాలు తప్పనిసరి



బస్సును సీజ్ చేసిన అధికారులు

పేట్‌బషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై జిల్లా రవాణశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మూడు రోజుల్లో మేడ్చల్ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో 41 బస్సులను సీజ్ చేసినట్లు డీటీఓ రఘునందనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో ఫిట్‌నెస్ పనులు బీమా పత్రాలు, లైసెన్స్ తప్పని సరిగా అందుబాటులో ఉంచుకోవాలని, వాహనదారులు త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నారు. ఈ తనిఖీల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్వీఎన్ ప్రతాప్‌రాజు, ఆర్ బాబు, శిల్పా, త్రివేణిబాయి పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అల్లాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానంద నగర్‌లోని వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన కల్యాణంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పులిగొల్ల శ్రీనివాసయాదవ్, సభ్యులు సిరికి శ్రీనివాసరావు, గుత్తికొండ రామకృష్ణ, బొంత హరికృష్ణ, కలవల ఏడుకొండలు, కుక్కిరాల ప్రకాష్‌రావు, సనపల ప్రసాద్‌రావు, సైదయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

రిటర్నింగ్ వాల్ నిర్మించాలి

బాలానగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా అత్యవసర చర్యలు చేపట్టాలన్నారు. పంచవటి అపార్ట్‌మెంట్ నుంచి పల్లవి అపార్ట్‌మెంట్ వరకు ఆర్‌సీసీ స్ట్రీమ్ వాటర్ డ్రైన్, కల్యాణ్‌నగర్, నవజీవన్‌నగర్, గీతానగర్ వరకు నాలా రిటర్నింగ్ వాల్ పనులను చేపట్టాలని జడ్సీకి విన్నవించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జీడిమెట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సూరారం 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. సూరారం గ్రామం, ఆర్‌జీకె, ఫీడర్ల పరిధిలోని బహదూర్‌పల్లి, మరాటీబస్తీ, రాజీవ్‌గృహకల్ప, తెలుగుతల్లినగర్, మైత్రీనగర్, సూరారంకాలనీ, 60 గజాలు, ఆర్‌జీకె బ్లాక్స్, తులసీ కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్‌హిల్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు : కూన


శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు


గాజులరామారం: ఆలయాలు ప్రశాంతతకు నిలయం గా ఉంటాయని, ఆలయాల అభివృద్ధి కొరకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో నూతనంగా నిర్మించిన షెడ్డు ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్, కమిటీసభ్యులు పెంటారెడ్డి, బాలరాజు, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

23న సంగీత, నృత్య, వాద్య పోటీలు

కూకట్‌పల్లి. జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీ మూడోఫేజ్‌లోని లలిత పరమేశ్వరి దేశాలయ ప్రాంగణంలోని త్యాగరాజ కళాపీఠంలో ఈనెల 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు సంగీత, నృత్య, వాద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వీఎంకె జగపతిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు ఆలయంలోని కళాపీఠంలో సంప్రదించాలని కోరారు. అదే విధంగా ఈనెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో మయూరి నృత్యాలయ నిర్వాహకురాలు, నాట్యరత్న రాజనాల శ్రీదేవి పర్యవేక్షణలో విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మందుబాబుల అడ్డాగా 'సీఐఈ'

చోద్యం చూస్తున్న అధికారులు



బాలానగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ (సీఐఈ)కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారింది. పగలూ రాత్రీ తేడాలేకుండా కొందరు మందు బాబులు కార్లలో, బైక్‌లపై వచ్చి కార్యాలయంలో మద్యం తాగి, బిర్యానీ తిని, ఖాళీసీసాలను, కవర్లను అక్కడే పడేస్తున్నారు. కార్యాలయంలో ఏవో, అకౌంటెంట్, అటెండర్ పనిచేస్తున్నప్పటికీ వారంతా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్న సీఐఈ చైర్మన్ బద్రొద్దీన్, వైస్‌చైర్మన్ భరత్‌వీర్, సభ్యులెవ్వరూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సీఐఈ కార్యాలయం పరిస్థితిని, ఇతర సమస్యలను సీఐఈ చైర్మన్ బద్రొద్దీన్‌కు వివరిద్దామని స్థానికంగా ఉన్న పరిశ్రమల నిర్వాహకులు, సీఐఈ సభ్యులు ఆయన కోసం 20 రోజులుగా ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చిందని చెప్పారు. చైర్మన్ లేనప్పుడు పనులు చక్కదిద్దాల్సిన వైస్‌చైర్మన్ భరత్‌వీర్ సైతం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, దీంతో తమ సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో దిక్కు తోచడంలేదని సొసైటీ సభ్యులు వాపోతున్నారు. చైర్మన్‌వైఖరిపై జిల్లా డీసీవోకు గతంలో ఫిర్యాదుచేసినా వారేమీ పట్టించుకోలేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల నిధులు, ఆస్తులు ఉన్నా సీఐఈ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఇప్పటికైనా అధికారులు సీఐఈని గాడిలో పెట్టాలని సభ్యులు కోరుతున్నారు.

సొసైటీకి ఎన్నికలు జరిపించే వరకే మా బాధ్యత

బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న సీఐఈ కార్యాలయం, అందుబాటులో లేని సీఐఈ చైర్మెన్ విషయమై జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ రాజెందర్‌రెడ్డికి ఆంధ్రజ్యోతి ఫోన్‌చేసి వివరణ కోరింది. సొసైటీ కార్యాలయానికి, చైర్మెన్ అందుబాటులో లేక పోవడానికి తనకు సంబంధం లేదని, అదంతా సొసైటీ వాళ్లే చూసుకోవాలని, అది వారి బాధ్యత అని ఆయన నిర్లక్ష్యంగా చెప్పారు.

నాకేమీ తెలియదు

మందు బాబుల అడ్డాగా మారిన సీఐఈ కార్యాలయం, 20 రోజులుగా అందుబాటులో లేని సీఐఈ చైర్మన్ విషయాన్ని ఆరా తీసేందుకు కార్యాలయానికి ఆంధ్రజ్యోతి వెళ్లి ఏవో పట్టాభిని కలిసింది. తనకేమీ తెలియదు. కొన్ని రోజుల నుంచి చైర్మన్‌కు తాను కూడా ఫోన్లుచేస్తున్నా.. స్విచ్‌ఆఫ్ వస్తోందన్నారు. ఏదైనా అత్యవసర సమాచారం ఉంటే నేను వాట్సాప్ మెసేజ్ చేస్తున్నా.. స్పందనలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

- పట్టాభి, సీఐఈ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ (ఏవో) బాలానగర్


నిర్మలా సీతారామన్‌తో సుభాష్

తెలంగాణకు సాయం చేయండి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బీజేపీ నేత సుభాష్ వినతి

హైదరాబాద్, జూన్14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి ఇతోధికంగా సాయం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిరలాసీతారామన్‌ను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ కోరారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు గణనీయంగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన సుభాష్, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలను కైవసం చేసుకోవడంతోపాటు 35.02 శాతం ఓటుబ్యాంకు సాధించిందని ఆయన వివరించారు. తెలంగాణాలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని నిర్మలా సీతారామన్ సూచించారని సుభాష్ పేర్కొన్నారు.

బల్దియాలో దొంగలు పడ్డారు!

- ఫ్యాన్లు, నల్లాలు, ఏసీ కాపర్ వైర్లు చోరీ
- పాత ఫర్నీచర్, ఏసీలు కూడా..
- వరుసగా జరుగుతున్న దొంగతనాలు
- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలోని ఏసీల కాపర్ పైపులు, మరుగుదొడ్లలోని నల్లాలు, లైట్లు, కంప్యూటర్ల వద్ద స్పీకర్లు, కీబోర్డులు దొంగలించి అమ్ముకుంటున్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉంచిన పాత ఫర్నీచర్, ఏసీలూ చోరీకి గురైనట్టు ఓ అధికారి చెప్పారు. వాస్తవంగా పాత ఫర్నీచర్, ఇతర వస్తువులను వేలం వేసి అమ్మాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు నెలల తరబడి పట్టించుకోకపోవడంతో దొంగల పాలయ్యాయి. కార్యాలయం చుట్టూ, ప్రతి అంతస్తులో సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పని చేయడం లేదు. ఇప్పటికే పలుమార్లు చోరీలు జరిగినా.. ఒక్కరినీ గుర్తించలేదు. వీటి గురించి అధికారులు రెండు, మూడు పర్యాయాలు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. అయినా చోరీలు ఆగకపోగా.. క్రమేణా పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలతోపాటు 24 గంటలూ కార్యాలయంలో సెక్యూరిటీ ఉంటుంది. అయినా చోరీలు జరుగుతుండడం గమనార్హం. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణంగా కార్యాలయ పని వేళలు. అయినప్పటికీ.. కొందరు అధికారులు సమావేశాలు, ఇతర పనుల కోసం రాత్రి ఏడెనిమిది గంటల వరకు, ఒక్కోసారి అంతకంటే ఎక్కు వ సమయం ఉంటారు. అధికారులు, ఉద్యోగులు వెళ్లిన అనంతరం విభాగాల వారీగా, ప్రధాన గేట్లకు ఎక్కడికక్కడ తాళాలు వేయాలి. భవనంలోకి వెళ్లేందుకు మేయర్, కమిషనర్ వైపున్న ద్వారాలను, ప్రధాన గేట్లూ అర్ధరాత్రి 11, 12 గంట ల వరకు తెరిచే ఉంచుతున్నారు. ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఓ వివాదానికి సంబంధించి కేసు నమోదు కాగా.. పోలీసులు జీహెచ్ఎంసీ ఐటీ విభాగం అధికారులను సీసీఫుటేజీ అడిగారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఐటీ విభాగం చెప్పడంతో పోలీసులు తెల్లమొహం వేశారు. కెమెరాలు పనిచేయకుంటే మీ సంస్థలో జరిగే చోరీల బాధ్యులనూ ఎలా గుర్తిస్తామని ప్రశ్నించారు. రెండు, మూడేళ్లకోమారు కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తోన్న అధికారులు.. వాటి నిర్వహణకూ రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. అయినా అవి సక్రమంగా పని చేయక పోవడం గమనార్హం.

అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలపై

చర్యలు తీసుకోండి

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్(ఐఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఐఎస్‌యూ నేతలు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు మాట్లాడుతూ.. అటానమస్ హోదా తెచ్చుకున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు రూ.2 లక్షలు మొదలుకొని రూ.26 లక్షల దాకా డొనేషన్ల కింద దోచుకుంటున్నాయన్నారు. మేనేజ్‌మెంట్ కోటా భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకుండానే కాలేజీల యాజమాన్యాలు సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ లింబాద్రి సానుకూలంగా స్పందించారని, మేనేజ్మెంట్ కోటా సీట్లను కూడా ఈ ఏడాది కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారని నాగరాజు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన వారిలో ఐఎస్‌యూ రాష్ట్ర నాయకులు పి.వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

రైల్వే పోలీసుల అప్రమత్తం

లక్షలాది విలువైన చోరీ సొత్తుస్వాధీనం

హైదరాబాద్, జూన్14(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ రైల్వే (ఆర్పీఎఫ్) పోలీసులు మే నెలలోనే పలు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి లక్షలాది రూపాయాల విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని రైల్వే అధికారులు తెలిపారు. ప్రధానంగా 'ఆపరేషన్ యాత్రిసురక్ష' ద్వారా 53 కేసులను నమోదు చేసి 37 మంది నేరస్తులను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.29.58 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే 'ఆపరేషన్ అమానత్' కార్యక్రమం ద్వారా 243 మంది ప్రయాణికులు పోగొట్టుకున్న దాదాపు రూ.57 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించినట్టు తెలియజేశారు. ఇక ఆపరేషన్ నార్కోస్ ద్వారా 8 మందిని అరెస్టు చేసి దాదాపు రూ.38 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. అలాగే ఆపరేషన్ నాన్ హే ఫారిస్తే కింద పారిపోయిన 133 మంది (102 బాలురు, 31 మంది బాలికలు) పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా -ఆపరేషన్ ఆహ్టా కింద 18 మంది మానవ అక్రమ రవాణాదారుల బారి నుంచి 58 మందిని (52 మంది బాలురు, మరో 6 గురు బాలికలు)రక్షించినట్టు తెలిపారు. దీంతోపాటు 'ఆపరేషన్ సటార్క్' 21 కేసులు నమోదు చేసి 11 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3,94,092 విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. ఆపరేషన్ ఉపలబ్ద్ కింద రూ.2,30,779 విలువైన 129 లైవ్ రైల్వే టికెట్లను స్వాధీనం చేసుకుని 27 మంది దళారులను అరెస్టు చేసినట్టు తెలిపారు. సీసీటీవీ సాంకేతికతను ఉపయోగించి నలుగురిని అరెస్టు చేసి రూ.1.40 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆపరేషనల్ రైల్ సురక్ష కింద 41 కేసులను నమోదు చేసి రూ.1.62 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- 12 మంది అరెస్ట్
- రూ.3 లక్షల 79 వేల నగదు స్వాధీనం

నిజాంపేట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై బాచుపల్లి పోలీసులు దాడి చేసి 12 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి నుంచి రూ.3 లక్షలా 79 వేల నగదు, 20 ప్లేయింగ్ కార్డ్సు సెట్లు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. నిజాంపేట్ కార్పొరేటర్ ప్రసన్న జగదీష్‌యాదవ్, రాజీవ్‌గాంధీనగర్‌లోని అద్దెకు ఇచ్చిన ప్రసన్న నిలయంలోని పెంట్‌హౌజ్‌లో కొందరు వ్యక్తులు బెట్టింగులు చేస్తూ, పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఆ భవనంపై దాడి చేశారు. నిజాంపేట్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బంకరి అప్పన్న, చిత్తారి గోపీచంద్, సూరంపల్లి మోహన్‌కృష్ణ, మజ్జివర్మ, శంభుతిరుపతిగౌడ్, సింహాచలం, వెంకటరమణ సిరిపురం, గందం సూర్యనారాయణమూర్తి, ఎ.వేణు, కొల్లి రమేష్, కంచెర్ల వెంకటేశ్వరరావు అలియాస్ బాలాజీలను అదుపులోకి తీసుకొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

కూకట్‌పల్లి. జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు, నాలా ఆక్రమణలపై అధికారులు కన్నెర్ర చేశారు. కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి ప్రశాంతినగర్ బస్టాపు వరకు గల రహదారికి ఇరువైపులా ఉన్న సుమారు 20 అక్రమ షెడ్లను అధికారులు శుక్రవారం తొలగించారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, పోలీసు విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా ప్రశాంతినగర్‌లోని నాలాపై వెలసిన దుకాణాలను కూల్చివేశారు. రోడ్డు, నాలాల ఆక్రమణపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామని అధికారులు తెలిపారు.

'ఆకృతి' అక్రమ అనుమతులు రద్దు చేయాలి'

నిజాంపేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలో ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ అప్రొచ్ రోడ్ లేకున్నా ప్రభుత్వ భూమిని ప్రైవేట్ రోడ్‌గా చూపిస్తూ అక్రమంగా పొందిన అనుమతులను రద్దు చేయాలని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ హెచ్ఎండీఏ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 453/1, 2 బాచుపల్లిలో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా అకృతి కన్‌స్ట్రక్షన్స్ భవనం నుంచి చెరువు కట్టపై మెయిన్‌రోడ్డుకు అప్రొచ్ రోడ్డు లేకపోయినా హెచ్ఎండీఏ అధికారులు ఏవిధంగా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. జెపీఓ సైట్ విజిట్ రిపోర్టులో అప్రొచ్ రోడ్డు ఉందని తప్పుడు రిపోర్టు ఇచ్చారని పేర్కొన్నారు. అధికారుల అండదండలతోనే భవన నిర్మాణాలు సాగుతున్నాయని, ప్లాట్లు కొన్న వారు భవిష్యత్‌లో ఇబ్బంది పడతారన్నారు. తప్పుడు నివేదిక ఇచ్చిన జెపీఓ సుధీర్, అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారం మరాఠీబస్తీకి చెందిన జి.సాయిరామ్‌చారి(31) కార్పెంటర్. తాగుడుకు బానిసైన సాయిరామ్‌చారి ఆత్మహత్య చేసుకుంటానని తరుచూ భార్య, తల్లిని బెదిరించేవాడు. గురువారం రాత్రి ఫుల్‌గా తాగివచ్చిన సాయిరామ్‌చారి తన తల్లి, భార్య శిరీషతో గొడవపడ్డాడు. దీంతో వారు బయటకు వెళ్లిపోయారు. తిరిగి వచ్చేసరికి సాయిరామ్ ఇంట్లో ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు సూరారంలోని నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన డాక్టర్లు అతడు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అదృశ్యమైన రక్షిత, మీర్జాఖయూమ్, చాంద్‌పాషా, రమేష్

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి అదృశ్యం

జీడిమెట్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో నివాసముంటున్న నలుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దామెర రక్షిత(19) పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఈనెల 13వతేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి అదృశ్యమైంది. అదేవిదంగా జగద్గిరిగుట్టకు చెందిన మీర్జాఖయూమ్ (36) ఈనెల 1వ తేదీని భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. మానసికస్థితి సరిగా లేని యువకుడు చాంద్ పాషా(20) ఈనెల 11వ తేదీన అదృశ్యమయ్యాడు. అదేవిధంగా ఈనెల13వ తేదీన లెనిన్‌నగర్‌కు చెందిన రమేష్ (32) భార్యతో గొడవపడి ఆమెపై దాడి చేశాడు. అనంతరం అదృశ్యమయ్యాడు. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి..

గాజులరామారం: మద్యం తాగొచ్చి భార్యతో గొడవపడిన భర్త ఇంటి నుంచి అదృశ్యమైయ్యాడు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారంలో నివాసం ఉండే లకన్ సంజయ్ హట్ కర్(22) ఈనెల 11న రాత్రి తాగి వచ్చి భార్య నిషాలకన్‌తో గొడవపడ్డాడు. తెల్లవారుజామున ఇంట్లో ఉన్న ఏటీఎం కార్డును తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య నిషాలకన్ చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో ఆమె సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐఎస్ఐ ఫలితాల్లో గురుకుల విద్యార్థికి

ఆల్‌ఇండియా 137వ ర్యాంకు


రేవంత్

రాయదుర్గం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐఎస్ఐ) ప్రకటించిన ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గౌలిదొడ్డి బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి జాడీ రేవంత్ ఆల్ ఇండియా 137వ ర్యాంకు, కేటగిరీ ర్యాంకు 4 సాధించినట్లు ప్రిన్సిపాల్ గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల సెక్రటరీ సీతాలక్ష్మి, హెచ్ఆర్ఆర్ వెస్ట్ ఆర్‌సి శారద, అడిషనల్ సెక్రటరీ సక్కునాయక్, ప్రిన్సిపాల్ విద్యార్థిని అభినందించారు.


విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న మదర్‌సేవా సమితి సభ్యులు

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

చందానగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనందిస్తే వారు ఉన్నతమైన స్థానాలకు చేరుకుంటారని మదర్‌సేవా సమితి అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి అన్నారు. మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో పాపిరెడ్డికాలనీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటుపుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించారు.


సాయిబాబాకు పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

సుమధుర స్వరకర్త సాయిబాబా

చిక్కడపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఆకాశవాణిలో కవుల గీతాలకు సంగీతాన్ని అందించిన సుమధుర స్వరకర్త సాయిబాబా అని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. బోయిబీమన్న సాహితీనిధి ఆధ్వర్యంలో విజయపల్లవి బోయి పేరిట ప్రముఖ సంగీత దర్శకుడు పీవీ సాయిబాబాకు సంగీత పురస్కారం బహూకరణసభ జరిగింది. వేణుగోపాలచారి పాల్గొని నగదు పురస్కారంతోపాటు సాయిబాబాను సత్కరించి మాట్లాడుతూ విజయపల్లవి ప్రభుత్వ ఉన్నతాధికారిణిగా సితార్ నిపుణగా గాయనిగా పేరు సంపాదించుకుని కరోనాకాలంలో జీవితం చాలించిందని చెప్పారు.